# ఆరోగ్యాంధ్రప్రదేశే లక్ష్యం

## దోమలపై దండయాత్రలో మంత్రి నారాయణ



ప్రతిజ్ఞ చేయిస్తున్న మంత్రులు, అధికారులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

**తిరుపతి(నగరపాలక), న్యూస్‌టుడే:** ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర పురపాలిక శాఖ మంత్రి పి.నారాయణ అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన దోమలపై దండయాత్రలో భాగంగా శనివారం ఆయన తిరుపతిలో పలు కార్యక్రమాలను నిర్వహించారు. లక్ష్మీపురంలో ఇంటింటి పరిశీలన అనంతరం ఆయన నగరపాలిక అధికారులు, తెదేపా నాయకులతో కలిసి ర్యాలీగా బయలుదేరి బైరాగపట్టెడలోని ఎంజీఎం నగరపాలిక పాఠశాలకు చేరుకున్నారు. వేలాది మంది విద్యార్థులచేత పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. అక్కడే దోమలపై దండయాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో 2016 అక్టోబర్ 2 నాటికే బహిరంగ మలమూత్ర విసర్జన రహిత నగరంగా తీర్చిదిద్దే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టడం శుభపరిణామమని అన్నారు. రాష్ట్రంలోని 110 నగరపాలిక, పురపాలికల్లో ఉత్పత్తి అయ్యే చెత్తను విద్యుత్ ప్లాంట్ల ద్వారా వినియోగించి ఘన వ్యర్థాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. దశలవారీగా అన్ని నగరపాలిక, పురపాలికల్లో భూగర్భ మురుగునీటి వ్యవస్థను అభివృద్ధి చేసి మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని మంత్రి ప్రకటించారు. అనంతరం బొజ్జల గోపాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత పాటించడం మన కర్తవ్యంగా భావించి అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సుగుణమ్మ, ఎమ్మెల్సీలు జి.శ్రీనివాసులు, వై.శ్రీనివాసులురెడ్డి, జిల్లా పాలనాధికారి సిద్ధార్థజైన్, తిరుపతి నగరపాలక కమిషనర్ వినయ్‌చంద్, జిల్లా వైద్యాధికారిణి విజయగౌరి, జిల్లా విద్యాశాఖాధికారి నాగేశ్వరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, జన్మభూమి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు